www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 3 డిసెంబర్ 2025 5 కాకినాడ



రాష్ట్ర స్థాయికి ఎంపికైన తేజశ్రీ

ప్రజాశక్తి – సామర్లకోట

మండలంలోని పవర జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థిని నిమ్మన తేజశ్రీ కౌశల్ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికయిందని పాఠశాల హెచ్ఎం ఎంవివి. గోపాలరావు తెలిపారు. మంగళవారం పాఠశాలను సందర్శించిన ఎంఇఒ. శివరామకృష్ణయ్య విద్యార్థిని తేజశ్రీని అభినందించారు. జిల్లా స్థాయిలో విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే 12 మంది విద్యార్థుల్లో తేజశ్రీ ఉండటం గర్వకారణమని అన్నారు.


తేజశ్రీని అభినందిస్తున్న ఎంఇఒ, ఇతరులు

కలవరపెడుతున్న కీటకం

- విజృంభిస్తున్న 'స్క్రబ్ టైఫస్' వ్యాధి
- కుట్టిన తర్వాత దద్దుర్లు, జ్వరం, తలనొప్పి
- ఆందోళనలో ప్రజలు
- అవగాహన తప్పనిసరి అంటున్న వైద్యులు

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

రాష్ట్రంలో వేగంగా విజృంభిస్తున్న 'స్క్రబ్ టైఫస్' వ్యాధి జిల్లా ప్రజలను కలవర పెడుతుంది. ప్రస్తుతం శీతాకాలం కావడంతో ఈ వ్యాధి ఉధృతి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలో కొన్ని కేసులు వెలుగు చూస్తున్న నేపథ్యంలో జిల్లా ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఈ బ్యాక్టీరియా బారిన పడిన వారిలో రాష్ట్రంలో తొలుత చిత్తూరు జిల్లా ఉండగా రెండో స్థానంలో కాకినాడ జిల్లా ఉండడం మరింత ఆందోళన కలిగిస్తుంది.

జిల్లాలో ఇప్పటికే 141 పాజిటివ్ కేసులను అధికారులు గుర్తించారు. స్క్రబ్ టైఫస్ అనేది నల్లిని పోలిన చిన్న కీటకమని, రికెట్సియా కుటుంబానికి చెందిన ఓరియంటియా సుట్సుగాముషి అనే బ్యాక్టీరియా వల్ల వ్యాధి వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఇది కుడితే శరీరంపై నల్లని మచ్చ, దద్దుర్లు ఏర్పడతాయి. వారం, పది రోజుల తర్వాత జ్వరం, వణుకు, తలనొప్పి, కండరాల నొప్పులు, జీర్ణసమస్యల రూపంలో ఇన్ఫెక్షన్ బయటపడుతుంది. సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోకపోతే శ్వాస సంబంధిత సమస్యలు, మెదడు, వెన్నెముక ఇన్ఫెక్షన్లు, మూత్రపిండాలు దెబ్బతినడం వంటి ఇబ్బందులు ఎదురవ్వడం ఖాయమంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.



కాకినాడ జిజిహెచ్‌లో ఏర్పాటు చేసిన నమూనాల పరీక్ష చేసే ల్యాబ్


జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో తుప్పలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

148 పాజిటివ్ కేసులు

రెండు నెలల నుంచి జిల్లాలో ఈ వ్యాధికి సంబంధించిన పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి గత నెల చివరి వరకు కాకినాడ జిజిహెచ్‌లో 1167 శాంపిల్స్‌ను పరీక్ష చేయగా 148 పాజిటివ్ కేసులు వెలుగులోకి వచ్చాయి. కాకినాడ స్మార్ట్ సిటీ, కాకినాడ రూరల్, సామర్లకోట, ప్రత్తిపాడు, తుని ప్రాంతాల నుంచి ఎక్కువగా ఈ కేసులు నమోదయ్యాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ జిజిహెచ్‌లో మాత్రమే వీటి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ జిల్లాతో పాటు అటు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఇటు తూర్పు గోదావరి జిల్లాల నుంచి వస్తున్న బాధితుల నుంచి శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుత వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా అనేకమంది వివిధ వ్యాధులతో సతమతమవుతున్నారు. స్క్రబ్ టైఫస్ వ్యాధితో ఇంకా అనేకమంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యాధిని నిర్ధారించలేకపోవడంతో వెలుగులోకి రాని అనేక కేసులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం డెంగీ, టైఫాయిడ్ వంటి సమస్యలతో సామాన్యులు సతమతమవుతున్న పరిస్థితి ఉంది. కీటకం కుట్టిన చోట పొక్కులు, దద్దుర్లు, జ్వరం, ఇతర లక్షణాలు కనుక కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇవీ జాగ్రత్తలు...

స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల తగు జాగ్రత్తలు తీసుకుంటే అపాయం నుంచి బయట పడొచ్చు అని వైద్యులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చెట్లు, పొదలు, పంట చేల దగ్గర చిగర్ (నల్లిలాంటి చిన్న పురుగు) కుడితే ఈ వ్యాధి వస్తుంది. దీని వలన 7 నుంచి 14 రోజుల్లో జ్వరం, వణుకు, తలనొప్పి, శరీరం నొప్పులు, కండరాల నొప్పులు, వాంతులు, జీర్ణ సమస్యలు, కుట్టిన చోట నల్లని మచ్చ లేదా దద్దుర్లు వంటి లక్షణాలు బయట పడతాయి. ఇటువంటి లక్షణాలు ఉంటే అలసత్వం చేయకుండా తక్షణం సమీప ప్రభుత్వ, ప్రయివేట్ ఆసుపత్రిలో పరీక్ష చేయించుకోవాలి. ఇంటి చుట్టూ పొదలు, కలుపు మొక్కలు లేకుండా తొలగించాలి. దుమ్ము, మట్టి, నీటి నిల్వలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలి. పొలాల్లో పని చేసేటప్పుడు పొడవైన చేతులు, కాళ్లతో ఉన్న బట్టలు ధరించాలి. చెత్త కాడలు, పొదల్లో కూర్చోకూడదు. పనికి వెళ్లి వచ్చిన వెంటనే స్నానం చేసి బట్టలు ఉతుక్కోవాలి. నిర్లక్ష్యం చేస్తే అవయవాల పనితీరు దెబ్బతినే ప్రమాదం ఉంటుంది.

మండలాల వారీగా నమోదైన కేసులు

గండేపల్లి 1, గొల్లప్రోలు 4, జగ్గంపేట 2, కాజులూరు 3, కాకినాడ రూరల్ 17, కాకినాడ అర్బన్ 58, కరప 4, కిర్లంపూడి 4, యు.కొత్తపల్లి 4, పెద్దాపురం 15, పిఠాపురం 2, ప్రత్తిపాడు 5, రౌతులపూడి 3, సామర్లకోట 11, శంఖవరం 2, తాళ్లరేవు 5, తొండంగి 6, తుని 1, ఏలేశ్వరం 1 కేసులు నమోదు అయ్యాయి.


నగర పాలక సంస్థ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఆదాయ పెంపుదలకు చర్యలు

ప్రజాశక్తి – కాకినాడ

కాకినాడ నగర పాలక సంస్థ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు వెంటనే చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి షాన్‌మోహన్ సగిలి తెలిపారు. మంగళవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఎన్‌వివి.సత్యనారాయణతో కలిసి వివిధ విభాగాల పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర నగర పాలక సంస్థలతో పోలిస్తే కాకినాడ ఆదాయం తక్కువగా ఉందన్నారు. కుళాయిల పన్ను బకాయిలు అధికంగా ఉండటం సరికాదన్నారు. డిసెంబర్ 10 వరకు చెల్లింపులకు గడువు ఉందని, 11వ తేదీ నుంచి బకాయిదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ రుసుముల్లో స్వల్ప పెంపు ప్రతిపాదనను అమలు చేయాలని సూచించారు. పార్కులు, ఉద్యానవనాలు, ఎన్‌టిఆర్ బీచ్ అభివృద్ధిపై చర్చించారు. ఫుడ్ కోర్టులు, ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, నెట్ క్రికెట్, గో కార్టింగ్ ట్రాక్‌లు, ఎమ్యూజ్‌మెంట్ రైడ్లు వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తే ప్రజలకు వినోదంతోపాటు, కార్పొరేషన్‌కు ఆదాయం పెరుగుతుందన్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరిలో నగరంలో బోట్ల పోటీల నిర్వహణ ప్రతిపాదనను కూడా పరిశీలించారు. పార్కులను ప్రయివేటీకరణ చేయడం లేదని, టెండర్ విధానంలో అభివృద్ధికి ముందుకు వచ్చే సంస్థలకు మాత్రమే నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కెటి.సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, ఎస్ఇ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పథ్వీ చరణ్, డిసిపి కృష్ణారావు, అకౌంటెంట్ రామశాస్త్రి, టిపిఆర్ఒ శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఆసుపత్రి అభివృద్ధిపై అధికారులు, అభివృద్ధి కమిటీ సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సూచించారు. మంగళవారం ఆసుపత్రి అభివృద్ధితోపాటు, సమస్యలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన దష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలపై చర్చించారు. శిథిలావస్థకు చేరుకున్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది కొరతను కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ సునీత, వాకపల్లి సరోజినీదేవి, అత్తిలి బాబురావు, రోళ్ల చక్రవర్తి, నాయకులు టి.లక్ష్మణరావు, డి.వెంకటరమణ, వాడ్రేవు వీరబాబు, వాసంశెట్టి శ్రీనివాస్, వినోద్, గంజా సూరిబాబు, వాకపల్లి చిరంజీవి, కుడుపూడి దుర్గాప్రసాద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడతున్న ఎంఎల్ఎ సుబ్బరాజు


డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న వాలంటీర్లు

పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి – గండేపల్లి

మండలం సూరంపాలెం గ్రామంలో ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పరిశుభ్రమైన జీవన విధానం సమాజ ఆరోగ్యాన్ని ఎలా కాపాడు తుందో ప్రజలకు వివరించారు. టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రభలడానికి గల కారణాలపై అవగాహన కల్పించారు. సురక్షిత తాగునీరు, ఆహార, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని అన్నారు. గ్రామ వీధులు, ఇంటి పరిసరాలు, పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. పేరుకుపోయిన చెత్తను తొలగించారు, ఈ సందర్భంగా డిప్యూటీ ప్రో ఛాన్సలర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ డాక్టర్ కిషోర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు కుంచే రాజా, గ్రామ నాయకులు పోసిన బాబురావు, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్యనారాయణ వాలంటీర్లకు అభినందనలు తెలిపారు. అలాగే ఆదిత్య ఎకో క్లబ్ ఆధ్వర్యంలో అనూరు గ్రామంలోని హైస్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్లు డాక్టర్ ఎస్.రమశ్రీ, డాక్టర్ ఎ. రమేష్, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ క్యాంపస్ లైఫ్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, డీన్ డాక్టర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వైద్యం అందక రోగి మృతి

- -ఆందోళనకు దిగిన స్థానికులు
- -డిఎంహెచ్ఒ విచారణ
- -వైద్యాధికారి సస్పెన్షన్

ప్రజాశక్తి – గొల్లప్రోలు, కాకినాడ

మండలంలోని చేబ్రోలు పిహెచ్‌సిలో వైద్య అందక ఒక రోగి మృతి చెందాడు. దీనిపై మంగళవారం స్థానికులు ఆందోళనకు దిగారు. దీనిపై డిఎంహెచ్ఒ విచారణ చేపట్టారు. అనంతరం కలెక్టర్ ఆదేశాలతో వైద్యాధికారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉదంతానికి సంబంధించిన వివరాలు ఇలావు న్నాయి.. మండలంలో ప్రతిపాడు మండలం శరభవరం గ్రామానికి చెందిన ఇమ్మంది మాణిక్యం గత కొంతకాలంగా గొల్లప్రోలులో ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి అతనికి గుండెపోటు రావడంతో హోటల్ యజమాని చేబ్రోలు పిహెచ్‌సికి తరలించారు. ఆసుపత్రి మూసి వేసి ఉండటంతో 108ను సంప్రదించారు. 108 వాహనం గంటన్నర వేసి చూసిన రాలేదు. ఈ నేపథ్యంలోనే బాధితుడు మాణిక్యం మృతి చెందాడు. పిహెచ్‌సిలో వైద్యు లు కానీ, సిబ్బంది కానీ లేకపోవడంతో అతనికి వైద్యం అందలేదని, ఫలితంగానే మృతి చెందాడని జడ్‌పిటిసి ఉలవకాయల నాగలోవరాజు, స్థానికులు ఆందోళనకు దిగారు.


సంఘటనపై విచారణ చేస్తున్న అధికారులు

డిఎంహెచ్ఒ విచారణ

వైద్యం అందక రోగి మృతి చెందిన సంఘటనపై డిఎంహెచ్ఒ నరసింహ నాయక్ మంగళవారం పిహెచ్‌సిలో విఆచరణ నిర్వహించారు. రోగి మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పిహెచ్‌సిలో వైద్య సేవలందించే వారంతా మండల హెడ్ క్వార్టర్స్‌లో తప్పనిసరిగా ఉండాలని అన్నారు. ఈ సంఘటనలో సిబ్బంది బాధ్యతారహిత్యం స్పష్టంగా కన్పించిందని డిఎంహెచ్ఒ మీడియాకు వివరించారు.

వైద్యాధికారి సస్పెన్షన్

మంగళవారం అర్ధరాత్రి సమయంలో ఆసుపత్రికి వచ్చిన రోగి వైద్యం అందక మృతి చెందిన సంఘటనపై పిహెచ్‌సి వైద్యుడు డాక్టర్ సాయిరతన్‌ను కలెక్టర్ ఆదేశాలతో సస్పెండ్ చేసినట్లు డిఎంహెచ్ఒ నరసింహనాయక్ తెలిపారు. చేబ్రోలు పిహెచ్‌సిలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు ఉండగా ఒక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి.నిఖిల్ సెలవులో ఉన్నారని, మరో డాక్టర్ సాయి రతన్ డ్యూటీ రోస్టర్ వేయడం, అత్యవసర విధులు నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించినందుకు సస్పెండ్ చేశామని అన్నారు. అలాగే స్టాఫ్‌నర్స్‌కి షోకాజు నోటీసు ఇవ్వడం జరి గిందన్నారు. తాళ్ళరేవు వైద్యాధికారి డాక్టర్ ఎల్.సురేష్ కుమా ర్‌ను డిప్యూటేషన్‌పై చేబ్రోలు పిహెచ్‌సికి పంపినట్లు తెలిపారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి – పెద్దాపురం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరుద్ధరించాలని ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో తాడిశెట్టి గంగ అధ్యక్షతన జరిగిన యూనియన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని కూటమి పార్టీల నాయకులు ఎన్నికల ప్రచారం సందర్భంగా హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర పూర్తయినా నేటికీ సంక్షేమ బోర్డును పునరుద్ధరించలేదన్నారు. కార్మిక సంఘాల తరపున అధికారులు, మంత్రులు, ఎంఎల్ఎలకు వినత పత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖ నగరంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలు విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పెదిరెడ్ల విష్ణు, జోకా సూర్యనారాయణ, దివిలి శ్యాం, భూసారి శ్రీను, షేక్ ఇబ్రహీం, కాకి దుర్గ, ఉప్పల మహేశ్వర రావు, షేక్ బాషా, కట్టా నాగేంద్ర పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పేదలకు దుప్పట్లు, దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి – గండేపల్లి

ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ప్రస్తుత చలి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని రాజమహేంద్రవరం పరిధిలోని నిరాశ్రయులు, పేద కుటుంబాలకు సుమారు రూ.30 వేలు విలువ చేసే దుస్తులు, దుప్పట్లు మంగళవారం అందజేశారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాసరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ డాక్టర్ ఐవి.వీరాంజనేయులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేలా కృషి

ప్రజాశక్తి – పెద్దాపురం

రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పౌరసరాల కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని కాండ్రకోట ఆర్ఎస్‌కె పరిధిలో ధాన్యం ఆరబెట్టిన కల్లాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం విక్రయించాలన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. తుపాను కారణంగా రైతులు తమ ధాన్యాన్ని సురక్షితంగా కాపాడుకునేందుకు దృష్టి సారించాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు తరలించాలన్నారు. వచ్చే రబీ సీజన్‌లో ప్రతి గ్రామంలో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. రబీ సీజన్లో యూరియా కొరత లేకుండా చూస్తామన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం అన్ని రకాలుగా రైతులకు సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.సంజయ్‌కుమార్, ఎలిశెట్టి చక్రప్రకాష్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి ఎన్‌వి.ప్రసాద్, బి.రాగస్రవంతి, గణేశ్వరరావు, ప్రవల్లిక, కె.అఖిల్, అమృత వర్షిని, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్

గురుభక్తిని చాటుకున్న పూర్వ విద్యార్థి

ప్రజాశక్తి – సామర్లకోట

క్రికెట్‌లో రంజీ ట్రోఫీ స్థాయిలో రాణించి, ప్రస్తుతం తంతి తపాలా శాఖలో ఉద్యోగం చేస్తున్న పెగడరెడ్డి సాగర్ తన గురుభక్తిని చాటుకున్నారు. తన ప్రతిభను గుర్తించి ప్రోత్సహించిన స్కూల్ అసిస్టెంట్ ఎం. వెంకటేశ్వర్లుకు కతజ్ఞతగా ఆయన పని చేస్తున్న సామర్లకోట పాఠశాలను మంగళవారం సందర్శించి హెచ్ఎం ఎం.లలితా మాణిక్యాంబలతో కలసి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తు ఉజ్వల మవుతుందని, ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ఇది ఎంతో సహాయపడుతుందని సాగర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రిమూర్తులు, అప్పారావు, శ్రీదేవి, నాగదేవి పాల్గొన్నారు.


క్రీడా దుస్తులు అందజేస్తున్న సాగర్

బెల్టు షాపులను తొలగించాలి

ప్రజాశక్తి – గొల్లప్రోలు

మండలంలో మద్యం బెల్టు షాపులను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి ప్రియంవద మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సక్రమంగా ఉపయోగించుకోవాలని కోరారు. మండలంలో బెల్టు షాపులు ద్వారా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారని, విద్యుత్ సరఫరాలో రోజు తీవ్ర అంతరం ఏర్పడుతుందని, రైతులు రీ సర్వేలో పెట్టుకున్న అర్జీలు పూర్తిస్థాయిలో పరిష్కరించలేదని ఈ సందర్భంగా పలువురు ఎంపిటిసిలు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ సూర్యం మాట్లాడుతూ సారా విక్రయాలు జరిపిన వారిపై కేసులు నమోదు చేశామని, బెల్ట్ షాపులను తొలగిస్తామన్నారు. పంచాయతీరాజ్ జెఇ కృష్ణమూర్తి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశామని, అవి టెండర్ దశలో ఉన్నాయని వివరించారు. ఎంఇఒలు బి.శివప్రసాద్, వి.శ్రీనివాస్ మాట్లాడుతూ పాఠశాలలో నిలిచిపోయిన నాడు నేడు పనులను ప్రభుత్వ ఆదేశంతో త్వరలో ప్రారంభిస్తామన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్‌లో మెరుగుపరిస్తామని ఇఒపిఆర్‌డి వి.సాగర్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సెలెట్ రాజు, వైస్ ఎంపిపి బత్తిన మంగ, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


అధికారులను నిలదీస్తున్న ప్రజాప్రతినిధులు



వికలాంగులను అభినందిస్తున్న ఎంఎల్‌సి పద్మశ్రీ, ఇతరులు

వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి – కాకినాడ

వికలాంగులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ సూచించారు. మంగళవారం స్థానిక పిఆర్ కాలేజీలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డిస్టిక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈ పోటీలను ఎంఎల్‌సి పద్మశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగులు అందరితో సమానంగా అన్ని క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, వారికి కావాల్సిన శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్, ఎంఇఒలు టి.సుబ్బారావు, సిహెచ్.రవి, కోరమాండల్ సిఎస్ఆర్ ఎజిఎం వంశీకృష్ణ, గిరిప్రసాద్, దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి – జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద మంగళవారం నిర్వహించిన డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆర్థిక సహకారాన్ని అందించారు. జనసేన నాయకులు పేదలకు ఆహారాన్ని అందించారు.


అన్నదానం చేస్తున్న జనసేన నాయకులు

కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి – సామర్లకోట

వైద్య విద్య ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మంగళవారం జరిగింది. పట్టణంలోని 19, 21వ వార్డుల్లో జరిగిన ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు పాగా సురేశ్‌కుమార్, మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ గోకిన సునేత్రదేవి, పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఇరుసుమల్ల సాయి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు మన్యం చంద్రరావు, మాజీ వైస్ ఛైర్మన్ గుణ్ణం రాజబ్బాయి, సొసైటీ మాజీ ఛైర్మన్ మేకా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - సీతానగరం

పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక అదృశ్యమైందని పోలీసులకు ఫిర్యాదు అందింది. బాలిక పెదనాన్న బాపిరాజు సీతానగరం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మాటలు సరిగా రాని బాలిక సోమవారం సాయింత్రం నుంచి కనిపించట్లేదన్నారు. కుటుంబ వివరాలు కూడా సరిగా చెప్పలేదని తెలిపారు. బాలిక ఆచూకీ తెలిస్తే వెంటనే సీతానగరం పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ రామ్ కుమార్ తెలిపారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు 9440904832, 9440904829 నెంబర్లను సంప్రదించాలన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డిపిఒ

మోసం కేసులో 8 మంది అరెస్టు

ప్రజాశక్తి - పిఠాపురం

ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేసిన కేసులో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాకినాడ ఎస్‌డిపిఒ మనీష్‌దేవరాజ్‌పాటిల్ వివరాలను వెల్లడించారు. గత నెల 24న పిఠాపురం కోటగుమ్మం సెంటర్లో ఉద్యోగ అవకాశాలు అంటూ నెలకు రూ.15 వేల నుంచి రూ.35 వేల వరకూ జీతం అంటూ పంపిణీ చేసిన కరపత్రం చూసి దానిలో ఉన్న ఫోన్ నెంబర్‌ను కాకినాడ రూరల్ రాయుడుపాలెంకి చెందిన నాళం గంగాభవాని సంప్రదించింది. ప్రాసెసింగ్ ఫీజులు, ల్యాప్‌టాప్ పేరుతో రూ.24 వేలు ఫోన్ పే ద్వార పంపించమని చెప్పి ఆమెను మోసం చేసినట్లు ఫిర్యాధు చేశారన్నారు. అలాగే కోటపల్లి సాయి, తన స్నేహితులు మరో ముగ్గురు కలిపి ఒక్కొక్కరు రూ.13 వేలు ఇచ్చినట్లు ఫిర్యాదు చేశారని తెలిపారు. వీటిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. ట్రాంజ్ ఇండియా కార్పొరేట్ నెట్‌వర్క్ ప్రయివేట్ లిమిటెడ్ పేరిట రాజమంహేంద్రవరంలో కార్యాలయం ఏర్పాటు చేసి, డేటా ఎంట్రీ/టెలికాలింగ్ ఉద్యోగాల పేరుతో కరపత్రలు ముద్రించి పిఠాపురం సహా పరిసర ప్రాంతాల్లో అతికించి, నిరుద్యోగుల నుంచి రూ.13 వేలు చొప్పున వసూలు చేసినట్లు తేలిందన్నారు. ఈ విధంగా గత ఏడాది నుంచి సుమారు రూ.75 లక్షల వరకూ వసూలు చేసినట్లు తమ విచారణలో తేలిందన్నారు. ప్రత్యేక బృందాల ద్వారా రాజమహేంద్రవరంలో 8 మంది, సత్యసాయి జిల్లా గుండువెల్ల గ్రామానికి చెందిన మేకల మంజునాథ్, కర్ణాటక రాష్ట్రం తమకూరు జిల్లా మల్ల నాయకనపల్లికి చెందిన సిద్ధేశ్ శ్రీధర్, సిద్దేశ్ సుదీ, నంద్యాల జిల్లా హనుమంతుకుండకు చెందిన యశ్వంత్ కుమార్, అనంతపురం జిల్లా మార్తాడు గ్రామానికి చెందిన వడ్డి జయరాముడు, పార్వతీపురం జిల్లాకు చెందిన దేశం సౌజన్య, అనంతపురం జిల్లా మద్దన్నకుంటకు చెందిన నాగప్ప కావ్య, ఉప్పలగుప్తం మండలం యానాంకి చెందిన రేపు మహాలక్ష్మిలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి ల్యాప్‌టాప్, అకౌంట్ బుక్స్, ఎటిఎం కార్డులు, మొబైల్స్, వివిధ నెట్‌వర్క్‌లకు చెందిన సిమ్ కార్డ్స్, రూ.53,000 నగదు, 20 గ్రాములు బంగారం, టీ షర్ట్స్, ట్రాన్స్ ఇండియా కంపెనీ ప్రమోషన్ ఐటమ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తలెఇపారు. నిందితులందరినీ కోర్టులో హజరుపరు స్తామని ఆయన తెలిపారు. నిరుద్యోగ యువత ఇలాంటి ఆకర్షణీయ ఉద్యోగ ప్రకటనను నమ్మి మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరంపాలెం గ్రామ శివారులో సోమవారం రాత్రి నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పేకాట శిబిరంపై ఎస్ఐ శివనాగబాబు, సిబ్బంది దాడి చేశారు. ఈ దాడిలో 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.14,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామం నున్న వారి వీధికి చెందిన వివాహిత తన కుమార్తెతో సహా అదృశ్యమైంది. ఈ మేరకు భర్త పలివెల జ్యోతిబాబు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో జ్యోతిబాబు తన ఇంటికి కిరాణా సరుకులు తీసుకుని వెళ్లాడు. అయితే మరికొన్ని సామన్లు తెమ్మని ఆతని భార్య సావిత్రి చెప్పింది. ఈ విషయానికి సంబంధించి భార్యపై జ్యోతిబాబు కేకలు వేసి బయటకు వెళ్ళిపోయాడు. కొంత సేపటికి అతడు తిరిగి ఇంటికి వెళ్లేసరికి భార్య సావిత్రి, కుమార్తె పూర్ణసాయి కృషిత ఇంటిదగ్గర కనిపించలేదు. వారి కోసం చుట్టుపక్కల గాలించి, స్థానికులను జ్యోతిబాబు భార్య, కుమార్తె గురించి అడిగాడు. కుమార్తెను తీసుకుని ఆమె పుట్టింటికి వెళ్ళిపోయినదని స్థానికులు తెలిపారు. అతని అత్తగారికి ఫోన్ చేయగా రాలేదని చెప్పడంతో బంధువుల ఇంటి వద్ద ఆచూకీ లభించ లేదు. దీంతో జ్యోతిబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి ఎఎస్ఐ వెంకటరమణ దర్యాప్తు చేస్తున్నారు.

యండవల్లి ఘటనలో ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీ వేటు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

అండపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల పట్ల కుల వివక్ష ఘటనకు సంబంధించి ముగ్గురు ఉపాధ్యాయులపై బదిలీ వేటు పడింది. విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులను బదిలీ చేసినట్లు ఎంఇఒ వేణుగోపాల్ మంగళవారం తెలిపారు. కులవివక్షపై యండవల్లి విద్యార్థులు సోమవారం ధర్నాకు దిగారు. ఈ ఘటనపై కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంఇఒను విచారణ అధికారిగా వేశారు. ఆయన మంగళవారం పాఠశాలలో విచారణ చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయుడు జి.సురేష్‌భూషణ్ ను శంఖవరం, ఆంగ్ల ఉపాధ్యాయుడు బి.శ్రీనుబాబును కరప, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.ప్రసాద్‌రావును రౌతులపూడి పాఠశాలకు బదిలీ చేసినట్లు తెలిపారు.

మోడల్ టెస్ట్ పేపర్లు ఎంతో ఉపయోగకరం

ప్రజాశక్తి - కాకినాడ

యుటిఎఫ్ ఆధ్వర్యంలో తయారు చేసిన ఎస్ఎస్‌సి 2026 మోడల్ టెస్ట్ పేపర్స్, బుక్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ప్రసంసించారు. మంగళవారం యుటిఎఫ్ రూపొందించిన ఎస్ఎస్‌సి-2026 మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఆమె తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థుల కోసం యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్‌ను అందించడం అభినందనీయమని అన్నారు. యుటిఎఫ్ నాయకులు మాట్లాడుతూ యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యల కోసం కృషి చేయడంతో పాటు పాఠశాల అభివృద్ధికి,


10వ తరగతి మోడల్ టెస్ట్ పేపర్స్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌జెడి నాగమణి

విద్యార్థుల అభ్యున్నతికి పని చేస్తుందని అన్నారు. 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలన్నా లక్ష్యంతో నిష్ణాతులైన ఉపాధ్యాయుల చేత టెస్ట్ పేపర్స్‌ను రూపొందించడం జరిగింద న్నారు. గత 8 సంవత్సరాలుగా యుటిఎఫ్ టెస్ట్ పేపర్స్‌ను రూపొందించి విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రవిచక్రవర్తి, జిల్లా అధ్యక్షులు సిహెచ్.సూరిబాబు, జిల్లా ప్రధానకార్యదర్శి కెవివి.నగేష్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎన్.గోవిందరాజులు పాల్గొన్నారు.

వికలాంగుల సేవలో..ధీరుభాయి ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం

ప్రజాశక్తి - తాళ్లరేవు

గత 17 వసంతాలుగా అంబానీ ఎర్లీ ఇంటర్వెన్షన్ అండ్ ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ మానసిక వికలాంగులకు సేవలందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటుంది. 2009 డిసెంబర్ 12న మండలంలోని కోరంగి పంచాయతీ సీతారామపురం ప్రాంతంలో ధీరుభాయి ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం ఏర్పాటు అయింది. ప్రారంభంలో 15 మంది వికలాంగులతో ప్రారంభమైన ఈ కేంద్రం ఒక టీచర్‌తో వికలాంగ విద్యార్థులకు విద్యను అందించేది. తర్వాత ఫిజియోథెరపీ సేవలు ప్రారంభించారు. మొదటి నుంచి మధ్యాహ్న భోజనం, ఆటో వసతి చిన్నారులకు యూనిఫామ్స్, పుస్తకాలు ఉచితంగా అందించి వయసుకు తగినట్లు తరగతులు నిర్వహించేవారు. కొద్ది కాలానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చేందుకు ఆటో, వ్యాన్ సౌకర్యం ఏర్పాటు చేశారు. అనంతరం వికలాంగ చిన్నారులకు స్పీచ్ థెరపీ, వృత్తి శిక్షణ సేవలు ప్రారంభించారు. చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చిన్నారుల్లో మానసిక ఎదుగుదలకు కృషి ప్రారంభం అయింది. ఈ సెంటర్‌లో పిల్లలతో పాటు వారి తల్లీదండ్రులకు శిక్షణ



వికలాంగ విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు(ఫైల్‌ఫొటో)

ఇవ్వడం ప్రత్యేకత. ప్రతి నెలలో రెండవ శనివారం ఏదో ఒక గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రంలో ఫిజియోథెరపీ పిల్లలకే కాకుండా, పక్షవాతం వచ్చిన వారికి, మెడ, మోకాళ్లు, నడుము నొప్పి కలిగిన వారికి ఇవ్వడం ప్రత్యేకత. ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ గాడిమొగ ఆర్థిక సహకారంతో ఈ సెంటర్ నిర్వాహణ జరుగుతోంది. ప్రత్యేక విద్య, స్పీచ్‌థెరపీ, ఫిజియోథెరపీ వంటి సేవలను ఇప్పటి వరకు 2,651 మంది ఉచితంగా పొందారని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌పి.రెడ్డి, రిలయన్స్ జిఎం వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. పేదలు, మధ్య తరగతి ప్రజలు ఈ కేంద్రం సేవలను వినియోగించుకునేందుకు కేంద్రం ఇన్‌ఛార్జ్ ఎంజె. గోపాల్‌రావును సంప్రదించాలని వారు కోరారు.

రాజ్యాంగం పట్ల అవగాహన అవసరం

ప్రజాశక్తి - యానాం

భారత రాజ్యాంగంపై యువతకు అవగాహన అవసరమని జనమిత్ర సంపాద కులు పొనుగుమట్ల విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక ఎస్ఆర్‌కె ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో వికషిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా యూత్ పార్లమెంట్ - 2026 కార్యక్రమం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వరుగు భాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి మూలమైన విద్య, సామాజిక న్యాయం, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్గివుండాలన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో యువత ముందు వరసలో ఉండాలన్నారు. తద్వారా నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని కోరారు. దేశం పురోగమించాలంటే యువతే కీలకంగా వ్యవహరించాలన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్, రాజ్యాంగం కల్పించిన హక్కులు తదితర అంశాలను వివరించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు మాట్లాడుతూ యువత జాతీయ సమస్యలను అవగతం చేసుకోవాలని, పార్లమెంట్ విధి విధానాలను అవగాహన చేసుకోవాలన్నారు. డిగ్రీ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపల్ కనకాల రామదాసు మాట్లాడుతూ దేశాభివృద్ధి యువత శక్తి సామర్థ్యాలు మీదే ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ పరిపాలనాధికారి, ప్రభుత్వ ఆస్పత్రి డిడి డాక్టర్ రవిశంకర్, ప్రిన్సిపల్ భాస్కరరెడ్డి, ప్రొఫెసర్ శీలం సూర్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, చెల్లి నరేష్, ఎం.శాంతరాజు, డాక్టర్ ముత్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విష్ణుమూర్తి, ఇతరులు

నిరుపయోగంగా తడి, పొడి చెత్త వాహనం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గొల్లలగుంటలో తడి, పొడి చెత్త వాహనం నిరుపయోగంగా ఉంది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో తడి పొడి చెత్త వాహనాన్ని 2022లో ఇచ్చారు. ఐతే ఆ వాహనాన్ని పారిశు ధ్య పనులకు గ్రామంలో ఏనాడు ఉపయోగించలేదు. లక్షల రూపాయలు వెచ్చించి అందించిన ఆ వాహనాన్ని వినియోగించక పోవడంతో పాడవుతుందని, కావున తక్షణమే ఆ వాహనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.


మూలన పెట్టేసిన తడి, చెత్త సేకరణ వాహనం

పెట్టుబడులకు ఎపి గమ్యస్థానం : మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

స్నేహ పూర్వక పెట్టుబడులకు ఎపి సరైన గమ్యస్థానం అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రెండు రోజుల పాటు ముంబాయిలో జరిగిన 12వ సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్-2025లో పలువురు ఇన్వెస్టర్లతో ఎపిలో పెట్టుబడులపై చర్చించినట్లు మంత్రి దురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. చలన చిత్ర నిర్మాణం పర్యాటక రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను కల్పించే ప్రోత్సాహకాలు, రాయితీలపై ఇన్వెస్టర్లకు స్పష్టం చేశానన్నారు. ప్రపంచ పెట్టుబడిదారులతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీర ప్రరాత, ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫిల్మ్ టూరిజం సర్క్యూట్‌లను అభివృద్ధి చేసేందుకు విశాఖపట్నం, తిరుపతి, గండికోట, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, అరకు లోయలను గుర్తించామన్నారు. ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను వివరించాన్నారు. రెండు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకున్న ఆయన ఎపికి బయలు దేరారు.


పెట్టుబడిదారులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

పేదల ఆరోగ్య పరిరక్షణే ప్రధాన ధ్యేయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

పేదల ఆరోగ్య పరిరక్షణే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఐదుగురు లబ్ధిదారులకు రూ.9,33,066 విలువ చేసే చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం పేదల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తోందన్నారు. అత్యవసర వైద్య సేవలు అవసరమయ్యేవారికి ఎల్ఓసి రూపంలో తక్షణం సాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి టూరిజం శాఖ డైరెక్టర్ వాసిరెడ్డి రాంబాబు, నాయకులు నున్న కృష్ణ, షేక్ ఖాసీమ్, కలిదిండి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలికి చెక్కును అందిస్తున్న గోరంట్ల

4న విజయవాడలో ఎంఆర్‌పిఎస్ విజయోత్సవ సభ

ప్రజాశక్తి - గోపాలపురం

విజయవాడలో ఈ నెల 4న జరిగే విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం వాదాలకుంటలో ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సభ్యులు విజయోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లును ఆమోదించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపి ఎంఆర్‌పిఎస్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ప్రత్తిపాటి రాంబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బొబ్బిలి వెంకటరాజు, ఉభయగోదావరి జిల్లాల ఇన్‌ఛార్జి గెల్లా వెంకటశ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.


గిరిబాబును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించి ఏడాది పూర్తియిన సందర్భంగా మంగళవారం వివిధ గ్రామాల నుంచి వైసిపి నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకంతో పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి నియోజకవర్గానికి కోఆర్డినేటర్‌గా నియమించారని అన్నారు. ఆయన నమ్మకాన్ని ఒమ్మి చేయకుండా నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

రాజకీయ ప్రచార వేదికగా పేరెంట్స్ మీట్ : సిపిఎం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 5వ తేదీన పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్, టీచర్ సమావేశాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చడం తగదని సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో టిడిపి కార్యకర్తలు పాల్గొనాలని సిఎం చంద్రబాబు పిలుపునివ్వడాన్ని ఆయన తప్పుపట్టారు. విద్యా కమిటీలు, తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను మాత్రమే వీటికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. బయట వ్యక్తులు, విద్యార్థి సంఘాలు విద్యాసంస్థల్లోకి ప్రవేశించరాదని ఒకప్రక్క జీవో ఇచ్చిన ప్రభుత్వం మరోపక్క టిడిపి కార్యకర్తలను సమావేశాల్లో పాల్గొనాలని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శమని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా గతంలో ఇచ్చిన జిఒను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇళ్ల పట్టాలివ్వాలంటూ ధర్నా

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణ శివారు పులిమేరు దమ్ము పేటలో అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని మంగళవారం ధర్నా జరిగింది. రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో ఆర్‌సిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడారు. గత 25 సంవత్సరాలుగా ఈ కాలనీవాసులకు ఇళ్ల పట్టాలివ్వాలని పోరాడుతున్నారని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా వారికి పట్టాలు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతోపాటు, కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి రాజబాబు, కడితి సతీష్, కుంచే అంజిబాబు, రెడ్డి దుర్గాదేవి, కోట వీరబాబు, కోట అప్పల నరసమ్మ, సూర్యనారాయణ, దమ్ము వీరబాబు పాల్గొన్నారు.

గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకంలో ఇంటి నిర్మాణమునకు సంబంధించి ఈనెల 3లోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఎఇ కె.రాజేష్ మంగళవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పిఎంఎవై గ్రామీణ్ పథకంలో భాగంగా గృహ నిర్మాణానికి ప్రభుత్వం అందించే హౌసింగ్ స్కీం ఆన్‌లైన సర్వే ఈనెల 3తో ముగుస్తుందన్నారు. అర్హులైన వారు గృహ నిర్మాణ శాఖ ఎఇ కార్యాలయం, సచివాల ఇం.ఇనీరింగ్ అసిస్టెంట్ వారి ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 2,252 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఈనెల 4 నుంచి 14వరకూ దరఖాస్తుల జాబితాను వెరిఫికేషన్ చేస్తామని తెలిపారు.

చాగల్లు గ్రంథాలయంలో తనిఖీలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లులో శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ సెస్సు పూర్తి స్థాయిలో సంస్థకు జమయ్యేలా కృషి చేయాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి గద్దె శ్రీనివాస్‌కి సూచించారు. సిబ్బంది కొరత ఉందని, కొత్త సిబ్బందిని నియమించేందుకు ప్రస్తుతం అవకాశం లేదన్నారు. కొత్త నియామకాలు, బదిలీలు జరిగినపుడు తప్పక ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు.

భీమేశ్వరస్వామికి రూ.1.05 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - సామర్లకోట

కార్తీక మాసంలో భీమేశ్వర స్వామి ఆలయానికి రూ.1.05 కోట్లు ఆదాయం సమకూరింది. మంగళవారం దేవాదాయ శాఖ తనిఖీదారు వడ్డీ ఫణికుమార్ ఆధ్వర్యంలో ఈ ఏడాది అక్టోబర్ 9వ తేదీ నుంచి డిసెంబర్ రెండవ తేదీ వరకు 53 రోజులకు సంబంధించి హుండీల ఆదాయాన్ని లెక్కించారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని సేవల నందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారి నీలకంఠం, ధర్మకర్తల మండలి ఛైర్మన్ కంటే జగదీశ్‌మోహన్ మాట్లాడుతూ స్వామివారి దర్శన టికెట్ల ద్వారా రూ.36,29,398, కానుకల ద్వారా రూ.38,015లు, ప్రసాదం విక్రయాల ద్వారా ద్వారా రూ.12,86,855, అర్జిత సేవల ద్వారా రూ. 3,20,000, ఫోటోల ద్వారా రూ.11,540, ఆన్‌లైన్ విరాళాలు ద్వారా రూ. 7,94,876, అన్నదాన విరాళాల ద్వారా రూ.22,29,398, హుండీల ద్వారా రూ.22,37,942 వెరసి రూ.1,05,75,051 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చీమలకొండ వీరభద్రప్రసాద్, తాతపూడి సత్యఅరుణ్ వంశీ, గొల్తి సత్యనారాయణ, అలోక్ చంద్రజైన్, కంచర్ల సుష్మా మోహిని, కొండపల్లి సత్యవాణి, మందపల్లి వెంకట భాను పద్మ, గోనిపాటి బుల్లెమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు

నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం

ఆర్.ఓ.సి. నెం.17867/1997-జి1 తేది.01-12-2025

ప్రకటన

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల దానవాయిపేట లే-అవుటు నందలి స్థలములకు చేర్చి ఉన్న కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు స్థల యజమానులు ఆక్రమించుకొని నిర్మాణములు చేసుకొనియున్నారు. సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలముల యొక్క ఆవశ్యకత ప్రస్తుతము లేనందున సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు అనగా కన్సర్వేన్సీ లేన్ స్థలముల ఆక్రమణదారులకు విక్రయించుటకు తీర్మానము నెం. 03/471/2011, తేది.30-04-2011 నందు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించినారు. సదరు విషయమై ప్రభుత్వము వారు జి.ఓ.ఎమ్.ఎస్. నెం. 488, తేది.11-12-2013 నందు దానవాయిపేట నందలి కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారిని అనుమతించియున్నారు. శ్రీయుత జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం వారు చదరపు గజము ఒక్కింటికీ నిర్ణయించు ధరకు లోబడి దానవాయిపేట కన్సర్వేన్సీ లేన్ స్థలములను ఆక్రమణదారులకు విక్రయించుటకు గాను రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ వారు నిర్ణయించియున్నారు.

ఇందుపై సదరు కన్సర్వేన్సీ లేన్ స్థలములను గుర్తించి సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములను దానికి చేర్చి యున్న స్థల యజమానులకు వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకొనవలసినదిగా ఈ కార్యాలయము వారిచే నోటీసులు జారీ చేయడమైనది.

ఇందుపై ఈ క్రింది తెలిపిన మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులు కొనుగోలు చేయుటకు ఆసక్తి వ్యక్తపరచి దరఖాస్తులు దాఖలు చేసియున్నారు.

క్రమ సంఖ్య	సర్వే నెంబర్ మరియు డోర్ నెంబర్	దరఖాస్తుదారు పేరు (కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చియున్న స్థల యజమాని)	కన్సర్వేన్సీ లేన్ స్థల విస్తీర్ణము	కన్సర్వేన్సీ లేన్ స్థలమునకు సరిహద్దులు
1	తలుపు నెంబరు 46-17-18/1, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 343, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ అద్దంకి ఉదయ భాస్కర్ S/o. శ్రీరామమూర్తి	12.34 చ॥గ॥లు (6'-6" X 17'-1") 10.318 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము, టి.ఎస్. నెం. 343/పి - 17'-1" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము, టి.ఎస్.నెం. 340/పి - 17'-1" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము, టి.ఎస్. నెం. 340/పి - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 340/పి - 6'-6"
2	తలుపు నెంబరు 46-07-35, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 457 & 463 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ కంచర్ల యోగ నరసింహ ప్రసాద్ S/o. కంచర్ల రామారావు	43.33 చ॥గ॥లు (6'-06" X 60'-00") 36.23 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం.457/పి - 60'-00" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 457/పి - 60'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 457/పి - 6'-6"
3	తలుపు నెంబరు 46-17-41, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 451 Part & 448 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ చిక్కం మధుసూదనరావు S/o. చిక్కం సత్యనారాయణరావు (లేటు)	10 చ॥గ॥లు (6'-00" X 15'-00") 8.36 చ॥మీ॥	తూర్పు: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 448/పి - 15'-00" పడమర: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 451/పి - 15'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 448/పి - 6'-00" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 448/పి - 6'-00"
4	తలుపు నెంబరు 46-16-17/1, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 4, టి.ఎస్. నెం. 300 Part & 262 Part, దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి అపర్ణ జోగ W/o. ఉమేష్ జోగ	25.27 చ॥గ॥లు (6'-06" X 35'-00") 21.13 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 300/పి - 35'-00" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 362/పి - 35'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 262/పి - 6'-06" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 6'-06"
5	తలుపు నెంబరు 46-16-17, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 300 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి గెద్దాడ శారదా దేవి, భర్త: నేతాజీ నగేష్	11.04 చ॥గ॥లు (5'-01" X 4'-09/2), 9.23 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 300/పి - 20'-01" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 20'-00" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము - టి.ఎస్. నెం. 262/పి - 4'-09" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 262/పి - 5'-01"
6	తలుపు నెంబరు 46-23-11, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 7, టి.ఎస్. నెం. 503, 504 Part & 510 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి సుంకర ఫణి రాజకుమారి, భర్త: సాయి మాణిక్యాలరావు & అదర్స్	65 చ॥గ॥లు (90'-0" X 6'-6"), 54.35 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 503 & 504/పి - 90'-0" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 510/పి - 90'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 510/పి - 6'-6"
7	తలుపు నెంబరు 46-23-4, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 8, టి.ఎస్. నెం. 548 Part & 542 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీ కందుల విశ్వానంద కుమార్, S/o. కందుల సుబ్బారావు (లేటు)	43.29 చ॥గ॥లు (6'-6" X 60'-0"), 36.20 చ॥మీ॥	తూర్పు: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 548/పి - 60'-0" పడమర: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 542/పి - 60'-00" ఉత్తరము: రోడ్డు - 6'-6" దక్షిణము: పొరుగువారి స్థలము టి.ఎస్.నెం. 547/పి - 6'-6"
8	తలుపు నెంబరు 46-18-18, వార్డు నెంబరు 5, బ్లాకు నెంబరు 5, టి.ఎస్. నెం. 332 Part & 333 Part దానవాయిపేట, రాజమహేంద్రవరం	శ్రీమతి వేములపల్లి కృష్ణకుమారి, W/o. బాబ్జి రామకృష్ణ	18.17 చ॥గ॥లు (39'-03" + 39'-04"/2 x 03'-00" + 05'-4"/2) 15.19 చ॥మీ॥	తూర్పు: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 361/పి - 39'-04" పడమర: దరఖాస్తుదారుని స్థలము టి.ఎస్.నెం. 330/పి - 39'-03" ఉత్తరము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్. నెం. 361/పి - 5'-4" దక్షిణము: కన్సర్వేన్సీ లేన్ స్థలము టి.ఎస్.నెం. 361/పి - 3'-00"

కావున పైన పొందుపరచిన కన్సర్వేన్సీ లేన్ స్థలములను సదరు మున్సిపల్ కన్సర్వేన్సీ లేన్ స్థలములకు చేర్చి యున్న స్థల యజమానులకు విక్రయించుటకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే, ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి ఏడు (7) రోజుల్లోపు లిఖితపూర్వకంగా నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సంప్రదించవలసిందిగా కోరడమైనది.

సం/- **కమిషనరు**
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం